# ఒంటరి దూరం

లైబ్రరీ నుంచి ఇంటికి తిరిగి వచ్చానో లేదో నా భార్య అంది, "ఆనందంగారికి బాగాలేదట" వెంటనే అతనింటికి బయల్దేరబోతోంటే, "వచ్చేసరికి ఆలస్యం అవుతుందేమో, భోజనం చేసి వెళ్ళు" అంది.

"అక్కడ ఎక్కువసేపు ఉండను. అరగంటలో వచ్చేస్తాను" అని బయటకు వచ్చాను.

ఆనందం నాకు నలభయి సంవత్సరాలనుండి తెలుసు. అతని ఇల్లు మా పక్క వీధిలోనే ఉంది. రోజూ ఏదో సమయంలో కలుస్తూ ఉంటాం. అతను నాకంటే నాలుగయిదు సంవత్సరాలు పెద్దయినా ఆరోగ్యంగా ఉంటాడు. ఏ రుగ్మతా లేదు. వారం రోజుల కిందట ఒంగోలులో ఉంటున్న చిన్న కొడుకు దగ్గరకు వెళ్లాడు. తిరిగి వచ్చిన సంగతి నాకు ఇప్పుడే తెలియడం.

అతనికి ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పెద్దవాడు పెద్దపల్లిలో, రెండోవాడు ఈ ఊళ్ళో, మూడోవాడు ఒంగోలులో, కూతురు చిత్తూరులో ఉంటున్నారు. అందరికీ పెళ్ళిళ్ళయ్యాయి. రెండోవాడు ప్రసన్న తప్ప, మిగిలిన వాళ్ళందరూ పి.జి.లు చేసి లెక్చరర్లుగా పనిచేస్తున్నారు. ప్రసన్నకు చదువు అబ్బలేదో, ఏమో ఇంటర్ తర్వాత పయి చదువులకు వెళ్ళలేదు. జ్యూట్ మిల్లులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఒకే ఊళ్ళో ఉంటున్నా తండ్రితో ఉండడం లేదు. కంకరగుంటలో వేరేగా అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అతని భార్య జ్యోతి ప్రయివేటు స్కూల్లో టీచరుగా పనిచేస్తోంది.

నాకు ఆనందంలో నచ్చని విషయం ఏమిటంటే మిగిలిన ముగ్గురు పిల్లలమీద చూపించే ప్రేమలో కొద్దిగా అయినా ప్రసన్న మీద చూపించడు. నాతో మాట్లాడేటప్పుడు కూడా ప్రసన్న మాట ఎత్తేవాడు కాదు. ఆనందానికి, అతని భార్య విజయమ్మకు

ప్రసన్న అంటే ఇష్టంలేని విషయం నాకు అర్థమయింది. ఎందువలనో తెలియలేదు. కారణం అడుగుదామని చాలాసార్లు అనిపించింది కాని అడగలేకపోయాను. నా మటుకు నాకు ప్రసన్న మంచి వాడుగా అనిపించేవాడు. నాకు తెలిసినంతవరకు అతనికి ఎటువంటి దురలవాట్లు లేవు. అతని గురించి ఎవరూ చెడుగా చెప్పడం నేను వినలేదు. తల్లి తండ్రులకు పిల్లలమీద ప్రేమలో హెచ్చుతగ్గులుంటాయని ఎక్కడో చదివాను. నాకు ఒక్కతే కూతురు అవటాన అనుభవంలోకి రాలేదు.

ఆనందం ప్రస్తుతం తను ఉంటున్న ఇంటిని కూతురు పేర, మిగిలిన రెండు ప్లాట్లు పెద్దవాడికి, చిన్నవాడికి చెందాలని రెండు సంవత్సరాల కింద వీలునామా రాశాడు. ప్రసన్నకు ఏం రాయలేదు. నన్ను ఆశ్చర్యపరిచిన విషయం ఏమిటంటే, వీలునామా రిజిస్ట్రేషన్ విషయంలో ప్రసన్నే దగ్గరుండి తండ్రికి సహాయం చేయడం. ఇంకొకరయితే దూరంగా ఉండేవాళ్ళు. రిజిస్టరు అయిన వీలునామా ఆనందం నాకు చూపించినప్పుడు చదివి "ప్రసన్న సంగతి మర్చిపోయావేమిటి?" అడిగాను.

"వాడికేం తక్కువ?" అన్నాడు.

ప్రసన్న సంపాదన బొటాబొటిగా ఉంటుంది. ఏమీ దాచుకున్నాడని అనుకోను. వీలునామా విషయం ప్రసన్న దగ్గర ఎత్తినప్పుడు, "అంకుల్, అదంతా ఆయన స్వార్జితం, దానికోసం నేను వెంపర్లాడటం ఏం బావుంటుంది?" అన్నాడు. అతనన్న దాంట్లోనూ నిజం ఉన్నట్టనిపించింది.

ఎనిమిదన్నరకు ఆనందం ఇంటికి వెళ్ళాను. ప్రసన్న, జ్యోతి అప్పటికే అక్కడకు వచ్చి ఉన్నారు. ఆనందం మంచం మీద పడుకుని ఉన్నాడు. విజయమ్మ మంచానికి పక్కనున్న స్టూలుమీద కూర్చుని ఉంది. ఆనందం స్పృహలోనే ఉన్నాడు.

అతని పక్కనే మంచం అంచున కూర్చుని అతని చేతిని నాచేతుల్లోకి తీసుకున్నాను. శక్తి ఉన్నట్లు అనిపించడం లేదు.

"ఆనందం" పిలిచాను.

కళ్లు తెరిచాడు.

"ఎలా ఉంది?"

పేలవంగా నవ్వాడు. అతని చేతిని నిమురుతూ, "ఎలా ఉంది?" మళ్ళీ అడిగాను.

బావున్నట్టు తలూపాడు కాని మాట్లాడలేదు. అతని చూపులు నాకు కొత్తగా ఉన్నట్టనిపించాయి. అనుమానం వచ్చి, "నన్ను గుర్తు పట్టావు కదూ?" నవ్వుతూ అడిగాను.

తలూపాడు.

"చెప్పు.నేనెవరిని?"

"బసవరాజువి కదూ?" మాట స్పష్టంగా ఉంది. అతను నన్ను గుర్తుపట్టలేదు.

"నేను పరంధామయ్యను" అన్నాను.

"లలిత ఎలా ఉంది?"

"లలిత ఎవరు?"

"నీ భార్యపేరు నువ్వేమరిచిపోతే ఎలారా బసవరాజూ?"

ఆనందం జారిపోతున్నాడు. తలెత్తి విజయమ్మ వంక చూశాను. నోటికి చీరకొంగు అడ్డంపెట్టుకుని శబ్దం కాకుండా ఏడుస్తోంది. లేచి నుంచోబోయాను. అతను నా చేయి గట్టిగా పట్టుకున్నాడు.

"మంగళగిరి నుండి ఎప్పుడు వచ్చావు?" అడిగాడు.

నేను మంగళగిరి వెళ్ళడం ఏమిటి? ఏమని జవాబు చెప్పాలో తెలియడం లేదు.

"అరుణ చనిపోయిందట కదా. ఆ అమ్మాయి మంచిది".

నా చేయి నెమ్మదిగా విడిపించుకుని లేచి పంచలోకి వచ్చాను. ప్రసన్న, విజయమ్మ నా వెనకే వచ్చారు.

"ఒంగోలు నుండి ఎప్పుడొచ్చాడు?" అడిగాను.

"ఈ ఉదయం" అంది విజయమ్మ.

"ఒక్కడే వచ్చాడా?"

"మా చిన్నబ్బాయి టాక్సీలో తీసుకువచ్చాడు. అక్కడ వాడింట్లో వరండామెట్లు ఎత్తుగా ఉంటాయి. నిన్నరాత్రిమెట్లు దిగుతూ, సరిగా చూసుకోలేదేమో జారి కింద పడిపోయాడట. అక్కడ డాక్టరుకు చూపించానన్నాడు. వెన్నుపూసకు దెబ్బతగిలిందన్నాడట. ఆయన్ని తీసుకొచ్చి ఇక్కడ వదిలిపెట్టాడు. 'ఉండి ఇక్కడ డాక్టరుకు చూపించడమో, ఆస్పత్రిలో చేర్పించడమో చేయరా' అన్నాను. అర్జంటు పనుందని ఆయన్ని తీసుకొచ్చిన

టాక్సీలోనే తిరిగి వెళ్ళిపోయాడు. ఆయన సాయంత్రం వరకు బాగానే ఉన్నాడు. సాయంత్రం నుండే అదోలా మాట్లాడుతోంటే నాకు భయం వేసి ప్రసన్న కోసం కబురు పంపాను. బిడ్డ వెంటనే వచ్చాడు. ప్రసన్న మన వీధి చివర ఉన్న డాక్టరు దగ్గరకు వెళ్ళి ఆయన్ని వచ్చి చూడమని అడిగాడు. డాక్టరు వస్తానన్నాడు కాని ఇంతవరకు రాలేదు".

"డాక్టరు ఆస్పత్రిలో చేర్పించమంటే వెంటనే చేర్పించండి" అన్నాను.

ఆ డాక్టరు ఆనందానికి బాగా తెలిసినవాడు. ఈ సమయంలో అతని క్లినిక్ రష్‌గా ఉంటుంది. రావడానికి వీలువుతుందో, లేదో అనుకున్నాను కాని పావుగంటలోనే వచ్చేశాడు.

ఆనందాన్ని పరీక్షచేసి వెళ్తూ డాక్టరు నన్ను పక్కకు పిలిచి, "మహా అయితే ఒకరోజు... వెన్నుపూస విరిగింది... కింద పడ్డాక కదిలించకుండా ఉండాల్సింది. ఆస్పత్రికి తీసుకువెళ్ళినా లాభం ఉండదు" అని తల అడ్డంగా ఆడించాడు. మందులేమీ రాయలేదు.

ప్రసన్న అందరికీ ఫోన్లో చెప్పాడు. తెలతెలవారుతుండగా ఆనందం చనిపోయాడు. అందరూ చేరుకునేసరికి మధ్యాహ్నం దాటింది. అందరూ వచ్చేలోపల కావలసినవి, చేయవలసిన పనులన్నీ ప్రసన్న, జ్యోతిలే పూనుకుని చేశారు. విజయమ్మ దగ్గర లేకనో, ఏమో డబ్బేమీ బయటకు తీయలేదు. ఖర్చంతా ప్రసన్నే భరించాడు. అతని దగ్గర కూడా ఉన్నట్లు అనిపించలేదు. భార్యనగలు కొన్ని తాకట్టు పెట్టి కొంత, స్నేహితుల నడిగి కొంత తెచ్చాడు. అవీ చాలకపోతే కొంత వడ్డీకి కూడా తెచ్చినట్టుంది. నేను కొంత ఇవ్వబోతే తీసుకోలేదు. ఆనందం కాయం ఘనంగా వెళ్ళిపోయింది.

ఆ రాత్రి తొమ్మిది దాటాక షామియానా కింద నేనూ, ప్రసన్న కూర్చుని ఉన్నాం. జ్యోతి వాళ్ళింటికి వెళ్ళిపోయింది. నాకూ ఇంటికి వెళ్ళాలని ఉంది. విజయమ్మ, ఆనందం పెద్దకొడుకు, చిన్నకొడుకు, కూతురు, కోడళ్ళు, అల్లుడు సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు. ప్రసన్నను పిలవలేదో లేక అతను వెళ్ళలేదో నాకు తెలియదు. వాళ్ళు మాట్లాడుకునేవి షామియానాలోకి స్పష్టంగా వినిపించడంలేదు.

"మొత్తం ఎంత ఖర్చు అయింది?" అడిగాను.

నవ్వుతూ చెప్పాడు. అతని నవ్వు ఆనందం నవ్వులా అందంగా ఉంటుంది.

యుక్తవయసులో ఆనందం చక్కగా ఉండేవాడు. అతని ముఖకవళికలు వాళ్ళ పిల్లల్లో ఒక్క ప్రసన్నకే వచ్చాయి.

ప్రసన్న చెప్పిన ఖర్చు అతను భరించలేని మొత్తమే.

గదిలోంచి ఎవరో బయటకు వచ్చి మమ్మల్ని చూసి లోపలికి వెళ్ళారు. ప్రసన్న గురించి అనుకుంటాను. "ఇంకా వెళ్ళలేదు. బయట కూర్చుని ఉన్నాడు" అన్నమాటలు వినిపించాయి. ప్రసన్నను లోపలకు పిలుస్తారని అనుకున్నాను. పిలవలేదు.

"మిగిలిన వాళ్లు ఎవరూ ఏమీ ఇవ్వలేదా?" ప్రసన్నతో నాకు ఉన్న చనువు కొద్దీ అడిగాను.

తల అడ్డంగా ఆడించి, "నేను అడగలేదు" అన్నాడు.

ప్రసన్న అడగడు. వాళ్ళు ఇస్తారని నేను అనుకోవడం లేదు. అతను చేసిన అప్పులు తీరడానికి తేలికగా రెండు సంవత్సరాలు పడతాయి. తనను ఏనాడూ ప్రేమించని తండ్రి కోసమయి తలకు మించిన భారం వేసుకున్నట్లు అనిపించింది. పుట్టిన నేరానికి ఆ బంధాన్ని అలా నీళ్ళొదిలే ప్రయత్నం చేశాడా? అయి ఉండొచ్చు.

❖ **నవ్య వీక్లీ, 19 నవంబర్ 2008**